

మే 15లోగా పాఠశాల అభివృద్ధి పనులు పూర్తిచేయాలి 8లో..

గని కార్మికుల పనివేళలు మార్చాలి - టీబీజీకేఎస్ 8లో..

సేవల పెంపు ఎప్పుడు?



- వారానికి రెండు రోజులే నడుస్తున్న కరీంనగర్-తిరుపతి రైలు
- జగిత్యాల వరకు పొడిగించి, ఐదు రోజులు నడపాలని డిమాండ్
- దశాబ్దం గడుస్తున్నా పట్టించుకోని రైల్వే శాఖ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి వెళ్లేందుకు కరీంనగర్-తిరుపతి రైలు వారానికి రెండు రోజులే నడుస్తోంది. కరీంనగర్ నుంచి నడుస్తున్న ఈ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును వారానికి ఐదు రోజులైనా నడపాలని ప్రయాణికులు కోరుతున్నా రైల్వే శాఖ పట్టించుకోలేదు. దశాబ్ద కాలంగా ఈ రైలు వారానికి రెండు రోజులు మాత్రమే నడుస్తున్నది. ఈ రైలును జగిత్యాల వరకు పొడిగించాలని, వారానికి ఐదు రోజులు నడపాలని ప్రయాణికులు మొత్తుకుంటున్నా కూడా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. పెద్దపల్లి నుంచి ఇందూరు వరకు నిర్మించిన నూతన రైల్వే మార్గం పూర్తయిన తర్వాత మొదట కరీంనగర్ నుంచి సిర్‌పూర్‌కాగజ్‌నగర్ వరకు ప్రతి రోజు పుష్‌పుల్ రైలును ప్రారంభించారు. రైల్వే లైన్ పనులు పూర్తయిన కొద్ది ఆ రైలును ఇందూరు వరకు పొడిగించారు. జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ, పెద్దపల్లి, రామగుండం, మంథని, కరీంనగర్ ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే కాజీపేట, వరంగల్‌కు వెళ్లిపోవాల్సి వచ్చేది. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనించిన 2009లో కరీంనగర్ ఎంపీగా ఎన్నికైన పొన్నం ప్రభాకర్‌గౌడ్ కరీంనగర్ స్టేషన్ నుంచి తిరుపతికి సూపర్‌ఫాస్ట్ రైలును నడపాలని అప్పటి కేంద్ర రైల్వే శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో 2011 నుంచి వారానికి ఒకరోజు కరీంనగర్ నుంచి వయా పెద్దపల్లి, వరంగల్ మీదుగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపడం ప్రారంభించారు. ఈ రైలుకు డిమాండ్ పెరగడంతో ప్రభాకర్ అప్పటి యూపీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావడంతో 2013 నుంచి వారానికి రెండుసార్లు గురు, ఆదివారాల్లో నడపడం ప్రారంభించారు. 2014లో కరీంనగర్ ఎంపీగా ఎన్నికైన బోయినపల్లి వినోద్ కుమార్ తిరుపతి రైలును వారానికి కనీసం ఐదు రోజులైనా నడపాలని అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన మేరకు 2016లో రెండు, మూడు నెలల పాటు వారానికి తిరుపతికి ఐదు రోజులు రైలును నడిపిన అధికారులు ఆ తర్వాత నిలిపివేశారు. ఇప్పటికీ వారానికి రెండు రోజులు మాత్రమే నడుపుతున్నారు.

● ఎంపీల విజ్ఞప్తులు బుట్ట దాఖలు..

ప్రస్తుత పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కరీంనగర్-తిరుపతి రైలును వారానికి రెండు రోజులు నడపాలని కోరినప్పటికీ ఇప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. మరోవైపు నిజామాబాద్ ఎంపీ అరవింద్ కూడా కరీంనగర్ రైలును కనీసం జగిత్యాల వరకు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం రాలేదు. ఈ ఏడాది జనవరి 2న ఎంపీ బండి సంజయ్ రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి తిరుపతి రైలు సర్వీస్ సేవలను పొడిగించాలని కోరినా కూడా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. అలాగే 2021-22లో జరిగిన టైమ్ టేబుల్ కమిటీ సమావేశంలో ఈ రైలును బాసర వరకు పొడిగించి అక్కడి నుంచి ఆర్మూర్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్ మీదుగా నడిపించాలని ప్రతిపాదించి నప్పటికీ ఎటువంటి కదలిక లేదు. ఈ రైలు జనరల్ స్లీపర్, టూటైర్, త్రీటైర్ ఏసీ బోగీల్లో ప్రయాణించేందుకు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలంటే నెలరోజుల ముందు నుంచే చేసుకోవాల్సి వస్తున్నది. వెయిటింగ్ లిస్టులో వంద మంది వరకు ఉంటున్నారు. చివరకు తత్కాల్ టికెట్లు బుక్ చేసుకున్న వారిని కూడా 30 వరకు వెయిటింగ్ లిస్టులో పెడుతున్నారు. ముఖ్యంగా సెలవు దినాల్లో అధిక వెయిట్ లిస్టు ఉంటున్నది. వారంలో రెండు రోజులు నడుస్తున్న రైలు సీట్లన్నీ కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్‌లోనే పూర్తిస్థాయిలో నిండుతున్నాయి. తిరుపతికి మాత్రమే గాకుండా విజయవాడ, శ్రీకాళహస్తి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ఎంతగానో ఈ రైలు ఉపయోగపడుతున్నది. తిరుపతికి వెళ్లేందుకు గతంలో రైల్వే సేవలు తక్కువగా ఉండడంతో అక్కడికి వెళ్లి మొక్కులు సమర్పించుకునే వాళ్ల సంఖ్య తక్కువగా ఉండేది. ఐదు, పదేళ్లకోసారి వెళ్లేవాళ్లు. ఇప్పుడు రామగుండం లైన్ నుంచి కేరళ ఎక్స్‌ప్రెస్, కాజీపేట, వరంగల్ మీదుగా కృష్ణా ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్, కేరళ ఎక్స్‌ప్రెస్, ప్రత్యేక రైళ్లతో పాటు కరీంనగర్ నుంచి తిరుపతికి వారానికి రెండు రోజులు నడుస్తుండడంతో భక్తుల సంఖ్య పెరుగుతున్నది. ఏడాదికోసారి కుటుంబ సమేతంగా భక్తులు వెళుతుండగా, వ్యక్తిగతంగా నలుగురైదుగురు స్నేహితులు కలిసి నెల, రెండు నెలలు, మూడు మాసాలకోసారి తిరుపతికి వెళుతున్నారు. ప్రయాణికుల అవసరాలు, డిమాండ్‌ను గుర్తించి ఇప్పటికైనా కేంద్ర రైల్వే శాఖ స్పందించి కరీంనగర్ నుంచి తిరుపతికి వెళ్లే రైలును జగిత్యాల వరకు పొడిగించి వారానికి ఐదు రోజులు నడపాలని, ఈ రైలుకు శ్రీరాజరాజేశ్వర రైలుగా నామకరణం చేయాలని పలువురు కోరుతున్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ



సింగరేణి ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 16: వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆదేశించారు. మంగళవారం రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని నగరపాలక, సింగరేణికి చెందిన ఉపరితల జలాశయాలు, ఫిల్టర్‌బెడ్‌లను ఆమె పరిశీలించారు. నీటి సరఫరా తీరుపై కార్పొరేషన్ సింగరేణి సివిల్ అధికారులతో సమీక్షించారు. కార్పొరేషన్‌కు ఎల్లంపల్లి నుంచి నీటి సరఫరా జరుగుతుందని, ప్రస్తుతానికి ఎలాంటి నీటి ఎద్దడి లేదని కమిషనర్ శ్రీకాంత్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. సింగరేణి ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్ సింగరేణి సివిల్ అధికారులతో చర్చించారు. గోదావరి నుంచి ఎంత నీటిని పంపింగ్ చేస్తున్నారు, ఎన్ని ఇండ్లకు సరఫరా చేస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడితే మున్సిపల్ ట్యాంకర్లకు సింగరేణి ఫిల్టర్‌బెడ్ల నుంచి నీటిని ఇవ్వాలని ఆమె ఆదేశించారు. ఎండలు తీవ్రమవుతున్న పరిస్థితుల్లో నీటి ఎద్దడి ఏర్పడితే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలో పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టాలని, బోరు బావులను మరమ్మతులు చేసి వినియోగం లోకి తీసుకురావాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వెంట కార్పొరేషన్ ఎస్ఈ చిన్నారావు, ఈఈ సుచరణ్, డీఈ జమీల్, సింగరేణి సివిల్ సూపర్‌వైజర్ యు గంధర్‌రెడ్డి ఉన్నారు.

పంటలపై బీఆర్ఎస్ అబద్ధ ప్రచారం

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16: రైతులు పండించిన పంట చేతికి వచ్చిందని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నీళ్లు రాలేదు అని ఎన్ని మాయమాటలు చెప్పిన అబద్ధాలు ప్రచారంచేశారని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో చివర ఆయకట్టు వరకు ఈ రోజు వరకు కూడా వివిధ పంటల కోసం నీళ్లు అందించి చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. వరి కోతలు మొదలయ్యాయని, ఐకేపీ, పీఏసీఎస్, కేంద్రాల్లో వడ్లు కొనుగోలు సైతం ప్రారంభమయ్యాయన్నారు. అధికారులు, మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహలు కుమ్మక్కై తాలు, తరుగు పేరిట రైతులను ఇబ్బంది చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని, తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రంను పరిశీలించి ఏదైనా రైతులకు ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.

సాగు రంగంలో రైతులు మెలకువలు పాటించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

కమాన్‌పూర్, ఏప్రిల్ 16 : సాగులో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల మెళకువలు పాటిస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గుండారం గ్రామంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు సాగు రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులకు వివిధ అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులకు కాంతారావు, మండల వ్యవసాయాధికారి ప్రమోద్‌కుమార్, వ్యవసాయాధికారులు భుక్య మోహన్, చిందం శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఎఫ్‌సీఐ రాష్ట్ర కన్సల్టేటివ్ మెంబర్‌గా శ్రీనివాస్



మేకల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రావుల రాజేందర్

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 16 : ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా బీజేపీ పెద్దపల్లి మండల అధ్యక్షుడు, మండలంలోని చీకురాయి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్ యాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా మంగళవారం బాధ్యతలు స్వీకరించగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రావుల రాజేందర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ అధిష్ఠానం తనపై నమ్మకంతో నామినేటెడ్ పదవి ప్రకటించిందని, బాధ్య తగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. శ్రీనివాస్‌కు నామినేటెడ్ పదవి దక్కడంపై శిలారపు పర్వతాలు, రవియాదవ్, దాడిసంతోష్, తంగెడ రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

పొలాల్లోకి చెరువు నీరు వదిలిన దుండగులు

- ఆందోళనలో రైతులు



తూము ద్వారా పొలాల్లోకి వస్తున్న నీరు, కోతకు వచ్చిన వరి పొలాల్లో చేరిన నీరు

గోదావరిఖని, ఏప్రిల్ 16: గోదావరిఖని జనగామ గ్రామ ఊర చెరువులో నీళ్లను గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి పొలాల్లోకి వదలారు. వేసంగి పంట కింద సుమారు 250 ఎకరాల్లో జనగామ రైతులు సాగుచేశారు. వరి కోతకు రైతులు సిద్ధమయ్యారు. అందుకోసం పదిరోజుల క్రితమే చెరువు తూములను మూసివేశారు. ఒకటి రెండు రోజుల్లో కోత యంత్రాల ద్వారా వరి కోసేందుకు సిద్ధపడిన రైతులకు ఈ పరిణామం ఆందోళన కలిగించింది. రెండు తూములు ఉన్న జనగామ చెరువుకు అవతల్లి కొమ్ము తూము షటర్‌ను ఎవరో దుండగులు మొత్తం పైకిలేపారు. దీంతో చెరువులో నీళ్లన్నీ కింద ఉన్న కోతకు వచ్చిన వరి పొలాల్లో నిండాయి. ఈ పరిణామంతో కోత యంత్రాలు పది పదిహేను రోజుల వరకు పొలాల్లోకి దించే పరిస్థితి లేకుండాపోయింది. పదిహేను రోజులపాటు పొలాలు కోయకుంటే వరికంకుల నుంచి గింజలన్నీ నేలరాలే ప్రమాదం ఉంది. మంగళవారం ఉదయం ఇది గమనించిన రైతులు తూము మూసినప్పటికీ రాత్రంతా చెరువు నుంచి తూము ద్వారా పొలాల్లోకి నీరంతా పారింది. దీంతో సుమారు 200ఎకరాల్లోని వరిపంట చేతికి వస్తుందో లేదోననే ఆందోళనలో రైతులు ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- ఆర్‌వో కార్యాలయం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థ : కలెక్టర్



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

పెద్దపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్, రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్, డీసీపీ ఎం చేతనతో కలిసి కలెక్టరేట్ గేట్ నుంచి రిటర్నింగ్ అధికారి చాంబర్ వరకు కల్పించాల్సిన భద్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పార్లమెంట్ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25వరకు జరుగుతుందని, భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి సన్నద్ధంగా ఉన్నామని, నామినేషన్ వేసే అభ్యర్థులను పూర్తి సౌకర్యాలతో రిసీవ్ చేసుకునేందుకు, నామినేషన్ పత్రాలను జాగ్రత్తగా తీసుకునే విధంగా సన్నద్ధంగా ఉన్నామని అన్నారు. నామినేషన్ల స్వీకరణ తర్వాత నామినేషన్ల స్క్రూటీని ప్రక్రియ, ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తుల కేటాయింపునకు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని అన్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొని వస్తే వారి నామినేషన్ దాఖలు ప్రక్రియ త్వరగా ముగుస్తుందని, సజావుగా ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ చేపట్టేందుకు సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ నామినేషన్ స్వీకరణ ప్రక్రియ జరిగే కలెక్టరేట్ లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కలెక్టరేట్ గేటు వద్ద పోలీస్ అధికారులు మొదటి దశలో, ఆర్మ్ ఫోర్స్‌తో రెండవ దశలో, రిటర్నింగ్ అధికారి చాంబర్ వద్ద పారా మిలిటరీ ఫోర్స్‌తో మూడవ దశలో భద్రత ఉంటుందని తెలిపారు. నామినేషన్ వేసే సమయంలో ర్యాలీ నిర్వహించే అభ్యర్థులు ముందస్తుగా సువిధా యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఫస్టకమ్ ఫస్ట సర్వ్ విధానంతో ర్యాలీలకు అనుమతిచ్చి, అవసరమైన భద్రత కల్పిస్తామన్నారు. కలెక్టరేట్ వద్ద ఎంట్రీ,ఎగ్జిట్ వేర్వేరు పాయింట్లు ఏర్పాటుచేశామని, ఎగ్జిట్ పాయింట్ వద్ద వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించామన్నారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అభ్యర్థులు సైతం సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ క్రిష్ణ, సీఐ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 16 : గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాఘవపూర్‌లో ఉపాధి కూలీలు చేపడుతున్న పనులను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ పరిశీలించారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నర్సరీని పరిశీలించారు. వెంట ఏపీడి సత్యనారాయణ, ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్ పాల్గొన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారుల సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

ఓదెల, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం మంగళవారం రైల్వే ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు సర్వే నిర్వహించారు. ఏడేళ్ల క్రితం ఓదెల, పొత్కపల్లి, కొలనూర్‌లల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు కాగా, అనంతరం నిర్మాణానికి అనువైన ప్రాంతాల్లో మట్టి పరీక్షలు చేసి నమూనాలను సేకరించారు. ఈక్రమంలో మంగళవారం ఓదెల ప్రభుత్వ హైస్కూల్ వద్ద నుంచి ఎస్సారెస్పీ డి86 కెనాల్ మీదుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు వద్ద ఉన్న కెనాల్ బ్రిడ్జి వరకు 520 మీటర్ల పొడవునా అధికారులు కాలినడకన సర్వే నిర్వహించారు. అలాగే ఇరిగేషన్ కార్యాలయంలో సమావేశమై దీనికి సంబంధించిన సర్వే మ్యాప్‌ను పరిశీలించారు. మ్యాప్ ప్రకారంగా ఆర్‌వోబీ నిర్మాణంలో గ్రామస్తులకు నష్టం వాటిల్లే అంచనాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రసాద్, సోమనాథ్, కుమార్, కిషోర్, సజ్జత్ పాషా, రాజేష్ కుమార్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మదన పోచమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

రామగిరి, ఏప్రిల్ 16: మండలంలోని లద్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మదన పోచమ్మ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ మంగళవారం ఓసీపీ-2 అధికారులకు గ్రామ మహిళలు ఆలయం ఎదుట వినతిపత్రం అందజేశారు. ఓసీపీ-2 ప్రాజెక్టు విస్తరణలో మిగిలి ఉన్న ఏకైక దేవాలయంలో ప్రజల పూజలు చేసుకునేందుకు కోసం సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లను చేపట్టాలని వినతి పత్రంలో కోరారు.

మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 16: వేసవి దృష్ట్యా తాగు నీటి సమస్య పరిష్కారానికి మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటుచేసినట్లు కమిషనర్ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీరు, శానిటేషన్, విద్యుద్దీపాల సౌకర్యంలో సమస్యలుంటే 6303127484 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

మంథని, ఏప్రిల్ 16: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమౌతుందని బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. స్థానిక ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలు చేసిన అధికారంలోకి వచ్చాక హామీలను అమలుచేయక మోసం చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆగస్టు 15వ తేదీ వరకు రైతు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ప్రజలను మోసం చేసేలా ప్రకటిస్తోందన్నారు. సింగరేణి కార్మికుడిగా, ఉద్యమనేతగా ఈ ప్రాంతం.. ఈ మట్టితో ఎంతో అనుబంధం ఉన్న వ్యక్తి తాను అని అన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ ప్రాంత ప్రజలకు అనేక సేవలందించానన్నారు. మీ కష్టాలు తెలిసిన వ్యక్తిగా మీ ముందుకు వస్తున్న ఓటుతో ఆశీర్వదించండి అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. ఈ నెల 19వ తేదీన తాను పెద్దపల్లిలో నామినేషన్ వేస్తున్నానని, నామినేషన్ దాఖలు ప్రకియకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారన్నారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు జక్కు రాకేష్, తగరం సుమలత, శంకర్‌లాల్, రాచకొండ లక్ష్మి, ఏగోలపు శంకర్‌గౌడ్, నాగెల్లి సాంబయ్య, పోతిపెద్ది కిషన్‌రెడ్డి, రాజిరెడ్డి, గీతాబాయి, మబ్బు ఓదెమ్మ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ధర్మారం,ఏప్రిల్16: ధర్మారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మిట్ట మహిపాల్(45) అనే వ్యక్తి మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మృతుడి భార్య మల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

మల్లాపూర్, ఏప్రిల్, 16: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య(34) అనే రైతు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మామిడి నర్సయ్య అనే రైతు మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జబ్బు నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంటి రేకుల షెడ్డులోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు నర్సయ్య భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

● ఎస్‌యూ వీసీ ఆచార్య మల్లేశ్

గణేశ్‌నగర్, ఏప్రిల్16: ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఉప కులపలతి ఆచార్య మల్లేష్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో 2024 మహనీయుల జయంత్యుత్సవాలను (మహాత్మాజ్యోతిరావుపూలే, సావిత్రిబాయ్ పూలే, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, కొమరం భీమ్, చాకలి ఐలమ్మ) ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను నిర్మూలించాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశమంతా మహనీయుల సేవలను గుర్తించుకోవాలన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్య అడప సత్యనారాయణ మాట్లాడుతూ అత్యంత ప్రభావశీలి, దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం ఆచార్య గోన నాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వడమే ధ్యేయంగా పూలే దంపతులు జీవించారన్నారు. ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ కే పద్మావతి మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రిజర్వేషన్లతో అందరికీ సమాన అవకాశాలు వచ్చాయన్నారు. జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ మహనీయులంతా దేశ ప్రగతి కోసం, సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎం సరసిజ, ఆర్ట్స్, సైన్స్ కామర్స్ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కే తిరుపతి, డి విజయ ప్రకాష్, డి.విజయ్ కుమార్, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

టిప్పర్లకు జరిమానా

మల్యాల, ఏప్రిల్ 16: అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లకు రెవెన్యూ అధికారులు ఒక్కో టిప్పరుకు రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. సోమవారం మండలంలోని బల్వంతాపూర్‌లో గల రేగుల చెరువు నుంచి అక్రమంగా నల్లమట్టి తవ్వకాలు చేపట్టారనే దానిపై భారతపు శేఖర్‌తో పాటు ఎనిమిది టిప్పర్ల యజమానులు, డ్రైవర్లపైన పోలీసులు సుమోటో కేసు నమోదు చేసి టిప్పర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దీంతో తహసీల్దార్ టిప్పర్లకు జరిమానా విధించారు.

● ఇద్దరిపై కేసు..

మల్యాల మండలంలోని రాంపూర్ శివారులో వరదకాలువ మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కావేటర్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. టిప్పర్ డ్రైవర్ బంగారపు రమేష్, మట్టి తీస్తున్న ఎక్స్‌కావేటర్ యజమాని గంగాధర్‌పై ఇరిగేషన్ ఏఈఈ అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

● టిప్పర్ డ్రైవర్‌పై కేసు..

మల్యాల మండలంలోని రాజారంలో టిప్పర్ ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం అయింది. టిప్పర్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ సాయి దిలీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ సస్పెండ్

హుజూరాబాద్, ఏప్రిల్ 16: హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. సోమవారం ఆర్టీసీ డ్రైవర్ రవీందర్ చార్జి మెమో విషయంలో రూ. 20వేలు లంచం తీసుకుంటూ ఎల్కతుర్తిలోని ఓ హోటల్‌లో డిపో మేనేజర్ శ్రీకాంత్ ఏసీబీకి చిక్కిన విషయం విధితమే. డిప్యూటీ ఆర్‌ఎం సురికొంటి భూపతిరెడ్డి డీఎంపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక పంపించగా, సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 16: నిషేధిత గంజాయి రవాణా, అమ్మకాలు జరుపుతున్న ఆరుగురుఇ వ్యక్తులను గోదావరిఖని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14న సోమవారం సంత ఆవరణలో మచ్చుపేటకు చెందిన రఘును గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. రఘుని అదుపులోకి తీసుకుని విచారించగా, గుంటూరుపల్లికి చెందిన శివారూట్ వద్ద గంజాయి కొనుగోలు చేసి కాలనీ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తెలిపినట్టు సీఐ పేర్కొన్నారు. గుంటూరుపల్లిలో శివారూట్ కోసం వెళ్లగా అక్కడ శివ దగ్గర పనిచేసే మధు అదుపులోకి తీసుకుని వివచారించినట్టు సీఐ తెలిపారు.

మధు ఇచ్చిన సమాచారం ఆధారంగా శివారూట్ దగ్గర గంజాయి కొనుగోలు చేసిన వినోద్, శివప్రసాద్, చైతన్య, సాయి రేవంత్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1,117 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ బీ రవీందర్ తెలిపారు.

కష్టాలను ఎదిరించి.. లక్ష్యాన్ని సాధించి

● యూపీఎస్సీలో మెరిసిన వెలిచాల యువకుడు

● జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించిన బీడీ కార్మికురాలి కుమారుడు

రామడుగు, ఏప్రిల్ 16: తండ్రి అనారోగ్యంతో మృతి చెందాడు.. తల్లి బీడీలు చేస్తూ కొడుకును పోషించింది. ఎటు చూసినా కష్టాలు.. అయినా అతడు తన లక్ష్యంపైనే దృష్టి పెట్టాడు. అనుకున్నది సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. అతడే రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన సాయికిరణ్. అతడు బీటెక్ చదువుతుండగా తండ్రి క్యాన్సర్‌తో మృతి చెందాడు. సాయికిరణ్‌కు స్రవంతి అనే ఒక సోదరి ఉంది. పిల్లలిద్దరూ చదువులో ముందుండేవారు. ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నా తల్లి లక్ష్మి ధైర్యం కోల్పోలేదు. బీడీలు చేస్తూ పిల్లలను చదివించింది. పిల్లలూ


తల్లి, సోదరితో సాయికిరణ్

ఆమె నమ్మకాన్ని వమ్ము చేయలేదు. సాయికిరణ్ సోదరి స్రవంతి ఏఈఈగా పనిచేస్తున్నారు. సాయికిరణ్ వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేసి ఓ కంపెనీలో హార్డ్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. ఆర్థికంగా కొంత వెసులుబాటు లభించిన తర్వాత తాను చిన్నప్పటి నుంచి కలలు కన్న సివిల్స్‌పై దృష్టి సారించాడు. 2021 నుంచి ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా తానే సొంతగా ప్రిపేర్ అయ్యాడు. రెండో ప్రయత్నంలో లక్ష్యాన్ని చేరుకుని జాతీయ స్థాయిలో 27వర్యాంకు సాధించాడు.

అమ్మ అండతో చదివాను

- సాయికిరణ్, సివిల్స్ 27వ ర్యాంకర్

కష్టపడి చదివాను.. అనుకున్నది సాధించాను. ఇది నా జీవితంలో మధురమైన సందర్భం. అత్యున్నతమైన స్థానానికి చేరుకున్నందుకు సంతోషంగా ఉంది. మా అమ్మ అండగా నిలవడం వల్లే ఇది సాధ్యమైంది. కష్టాలను ఎదురించి మమల్ని చది వించిన అమ్మ ఇప్పుడు సంతోషంగా ఉంది. నాలాగే కష్టపడి చదివే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ సహకారాన్ని అందిస్తానను.

● విద్యాభ్యాసం

సాయికిరణ్ రామడుగు మండలం వెలచాల గ్రామంలో సరస్వతి పాఠశాలలో ఏడో తరగతి వరకు చదువుకున్నాడు. కరీంనగర్‌లో పదో తరగతి, ఇంటర్, వరంగల్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశాడు.

సంతోషంగా ఉంది

- లక్ష్మి, సాయికిరణ్ తల్లి

చాలా సంతోషంగా ఉంది. సాయికిరణ్ సివిల్స్‌లో జాతీయ స్థాయిలో 27వ ర్యాంకు సాధించడం మాకందరికీ గర్వకారణం. మా ఆయన లేకపోయినా కష్టపడి ఇద్దరు పిల్లలను చదివించాను. వారిద్దరు ప్రయోజకులయ్యారు. నా కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించింది. ఒక తల్లికి ఇంతకంటే సంతోషం ఏముంటుంది.


వెలిచాలలో సాయికిరణ్ ఇల్లు

'సహన'ంతో ముందుకుసాగి..

సివిల్స్‌లో 739వ ర్యాంకు సాధించిన కరీంనగర్ యువతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 16: యూపీఎస్సీ ఫలితాల్లో కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన సహన జాతీయస్థాయిలో 739వ ర్యాంకు సాధించి సత్తాచాటారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన కొలనుపాక గీత, జయశంకర్ ప్రసాద్ (అనిల్) దంపతుల కూతురైన సహన కెన్‌క్రెస్ట్ స్కూల్‌లో ఎసెస్సీ చదివారు. శ్రీగాయత్రీ జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ జేఎన్టీయూలో బీటెక్ పూర్తి చేశారు. ఇంజనీరింగ్ పూర్తికాగానే క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఉద్యోగం వచ్చినప్పటికీ సివిల్స్‌పై మక్కువతో ఉద్యోగంలో చేరకుండా ఢిల్లీకి వెళ్లి కోచింగ్ తీసుకున్నారు. తొమ్మిది నెలలు కోచింగ్ తీసుకున్న సహన మూడుసార్లు సివిల్ పరీక్ష రాశారు. నాలుగో ప్రయత్నంలో జాతీయ స్థాయిలో 739వ ర్యాంకు సాధించారు. సహన తండ్రి జయశంకర్ ప్రసాద్ (అనిల్) ప్రైవేట్ కళాశాలలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఒక దినపత్రికలో పాత్రికేయుడిగా పనిచేస్తున్నారు. తల్లి గీత గృహిణి. తమ కూతురు కష్టపడి చదివి నందుకు తగిన ఫలితం దక్కిందని, ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. తల్లిదండ్రుల సహకారంతో సివిల్స్‌కు ప్రిపేర్ అ య్యానని సహన చెప్పారు. ఈ ర్యాంకుతో ఐఆర్ఎస్ వస్తుందని, జాబ్‌లో జాయిన్ అయిన తర్వాత మళ్లీ సివిల్స్ రాసి ఐఏఎస్ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.


విజయ సంకేతం చూపుతున్న సివిల్స్ ర్యాంకర్ సహన


సహనకు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు గీత, జయశంకర్‌ప్రసాద్ (అనిల్)

ఉపాధ్యాయుల జీతాల బిల్లుల దుర్వినియోగంపై

కొనసాగుతున్న విచారణ

తిమ్మాపూర్, ఏప్రిల్16: మండలంలోని ఎల్ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా ఉపాధ్యాయుల జీతాల బిల్లుల దుర్వినియోగంపై విచారణ కొనసాగుతోంది. ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయుల జీతాల బిల్లుల నిధులు సుమారు 10లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. విచారణ అధికారిగా డైట్ ప్రిన్సిపాల్ శ్రీ రాం మొండయ్య, బెజ్జంకి, కోహెడ ఇంచార్జ్ ఎంఈవోగా విధులు నిర్వర్తిస్తున్న పావని ప్రజెంటింగ్ అధికారిగా, జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ కన్సల్టెంట్ రవీందర్‌ను టెక్నికల్ అధికారిగా జిల్లా విద్యాశాఖ అధికారి నియమించారు. ఈ నెల 15న విచారణ ప్రారంభించారు. రెండవ రోజు మంగళవారం 16న కూడా విచారణ కొనసాగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజభాను చంద్రప్రకాశ్‌తో పాటు మొత్తం 21మంది ఉపాధ్యాయులను విచారణ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నివేదికను జిల్లా విద్యాశాఖధికారికి సమర్పిస్తామని విచారణ అధికారి శ్రీరాం మొండయ్య తెలిపారు.

రాముని కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పణ

ఇల్లందకుంట, ఏప్రిల్ 16: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే శ్రీరామనవమిని పురస్కరించుకొని మంగళవారం ధర్మపురి, కొండగట్టు ఆలయాల కార్యనిర్వాహణాధికారులు స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో కొండగట్టు ఈవో చంద్రశేఖర్, ధర్మపురి ఈవో శ్రీనివాస్, ఇల్లందకుంట ఈవో కందుల సుధాకర్, అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యులు పాల్గొన్నారు.

నేడే సీతారాముల కల్యాణం

● ముస్తాబైన రాజన్న క్షేత్రం ● ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు ● తరలివస్తున్న భక్తుల

వేములవాడ, ఏప్రిల్ 16:వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీసీతారామచంద్ర స్వామివారల దివ్య కళ్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో భద్రాద్రిని తలపించేరీతిలో శ్రీసీతారామచంద్రస్వామివారి కల్యాణ వేడుకలను అత్యంత ఘనంగా, కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా 17వ తేదీ బుధవారం ఉదయం 11-59 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించే విధంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఆలయం, రాజగోపురం, ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. చైర్మన్ ఛాంబర్ ఎదుట విశాలమైన కల్యాణ వేదికను నిర్మించి పూలతో అందంగా అలంకరించారు. వేదిక పరిసరాల్లో కలకత్తా టెంట్లు, పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులు కూర్చునే ప్రాంతాన్ని సెక్టార్లుగా విభజించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎండవేడి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఎయిర్ కూలర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆలయ ముందుభాగంతో పాటు పాత ఆంధ్రాబ్యాంక్ ఏరియా, అంబేద్కర్ విగ్రహం కూడలి మొత్తం కలకత్తా పందిళ్లు వేశారు. శ్రీసీతారాముల కళ్యాణం భక్తులందరూ వీక్షించడానికి వీలుగా పలు చోట్ల ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, వైద్య శిబిరాలు, స్పెషల్ రెస్క్యూ బృందాలు ఏర్పాటు చేశారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్, అగ్నిమాపక యంత్రం సిద్ధంగా ఉంచారు. భక్తుల కోసం మంచినీటి ప్యాకెట్లు సిద్ధంగా ఉంచారు. దాతల సహకారంతో అన్నదానంతో పాటు మజ్జిగ పంపిణీ చేయనున్నారు.


గదుల కోసం వేచి చూస్తున్న భక్తులు


విద్యుత్‌కాంతులతో రాజన్న ఆలయం

తరలివస్తున్న భక్తులు..

శ్రీసీతారాముల కళ్యాణం తిలకించడం కోసం వేలాది మంది భక్తులు రాజన్న క్షేత్రానికి తరలివస్తున్నారు. 17వ తేదీ బుధవారం ఉదయం నిర్వహించనున్న కల్యాణం ప్రత్యక్షంగా తిలకించాలన్న కోరికతో మంగళవారం రాత్రి వరకు సుమారు 70 వేల మందికి పైగా భక్తులు వేములవాడకు చేరుకున్నట్లు అంచనా. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యాత్రీకులతో ఆలయ వసతి గదులు, ప్రైవేటు అద్దె గదులు నిండిపోయాయి. గదులు అందుబాటులో లేకపోవడంతో వేలాది మంది భక్తులు బహిరంగ ప్రదేశాలలోనే బస చేయాల్సి వచ్చింది. జానకిరాముల కల్యాణం సందర్భంగా త్రిశూలం ధరించి, తలంబ్రాలు పోసుకుని శివుడిని మను వాడే ఆనవాయితీ ఉన్న వేలాది మంది శివ పార్వతులతో పాటు భారీ సంఖ్యలో హిజ్రాలు వేములవాడ చేరు కున్నారు. శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాజరాజేశ్వరస్వామివారిదేవస్థానంలో బుధవారం కోడె మొక్కులు మినహా ఆర్జిత సేవలు నిలిపి వేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

వివాహిత ఆత్మహత్య


సుమలత(ఫైల్)

తిమ్మాపూర్, ఏప్రిల్16: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన గోస్కుల సుమలత(26)కు 2017వ సంవత్సరంలో తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహం జరిగింది. వీరికి నాలుగు సంవత్సరాల కూతురు ఉంది. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సుమలత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎల్ఎండి ఎస్సై చేరాలు తెలిపారు.

జీవితంపై విరక్తితో..

ముస్తాబాద్, ఏప్రిల్ 16: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడని ఎస్సై శేఖర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన బొప్ప బాలయ్య(67) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. వ్యాధి మరింత ఎక్కువ కావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుని కొడుకు బొప్ప అనిల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలు..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన సావనపెల్లి పోచవ్వ (70) అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పోచవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తిచెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 16: మండలంలోని ఎర్రనర్సుపల్లె గ్రామానికి చెందిన కంకటి స్వామి (45) క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. స్వామి గ్రామంలో కిరాణం దుకాణం నడుపుకొని జీవిస్తున్నాడు. వ్యవసాయ భూములలో బోర్లు వేయడం వల్ల దాదాపు 23లక్షల అప్పులు అయ్యాయి. అప్పు చెల్లించడానికి తనకు ఉన్న భూమిని అమ్మడానికి ప్రయత్నించగా తమ్ముడు ప్రభాకర్ అడ్డుచెప్పాడు. ఇంటిని అమ్మి అప్పులు తీర్చుదామనుకున్నా ఇంటిపై ప్రభాకర్ రుణం తీసుకున్నాడు. ఇదే విషయంపై తమ్ముడిని ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదు. దీనితో సోమవారం అర్ధరాత్రి క్రిమిసంహారక మందుతాగగా సిరిసిల్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. తన భర్త మృతికి ప్రభాకర్, అప్పులే కారణం అని కడుపుపై రాసుకొని చనిపోయాడని మృతుడి భార్య నాగమణి ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం


రాజయ్య(ఫైల్)

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 16: తన భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు అదృశ్యం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లికి చెందిన కొలకాని రాజయ్య (46) ఎనిమిది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రెండు సంవత్సరాలుగా ఆరోగ్యం బాగా ఉండటం లేదు. అప్పటి నుంచి మందులు వాడుతున్నాడు. గతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చాడు. ఈ నెల 9న రాత్రి 8.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బ్లూ కలర్ ప్యాంట్, ఎల్లో కలర్ టీషర్టు ధరించి ఉన్నాడు. రాజయ్య భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వరంగంటి రవి తెలిపారు.

స్కూల్ వ్యాన్ కింద పడి చిన్నారి దుర్మరణం


అరీబా (ఫైల్)

మల్యాల, ఏప్రిల్ 16: కొడుకును స్కూల్ వ్యాన్ ఎక్కించడానికి వెళ్లిన తల్లి.. తన వెనుకాలే వస్తున్న తన కూతురును గమనించకపోవడంతో అదే వ్యాన్ కింద పడి చిన్నారి దుర్మరణం చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండలం మద్దుట్ల గ్రామానికి చెందిన రజాక్, హసీనకు కొడుకు సాజీత్, కుమార్తె అరీబా(18నెలలు) ఉన్నారు. కొడుకు పక్క గ్రామంలోని సరస్వతీ విద్యానికేతన్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. మంగళవారం ఉదయం స్కూల్ వ్యాన్ రావడంతో కొడుకును ఎక్కించేందుకు తల్లి హసీన వెళ్లింది. వ్యాన్ వద్దకు చిన్నారి అరీబా రావడాన్ని తల్లి గమనించలేదు. సాజిత్ ఎక్కగానే వ్యాన్ ముందుకు కదలడంతో ముందు చక్రాల కింద అరీబా పడి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందింది. ఈ మేరకు డ్రైవర్ ఎనగందుల రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. వ్యాన్‌లో విద్యార్థులను ఎక్కించడానికి పాఠశాల సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ సర్కార్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16: భారత దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్కార్ ఖూనీ చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం సీపీఐ జిల్లా కార్యాలయంలో కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. చంద్ర రాజేశ్వరావు చిత్రపటానికి చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు మర్రి వెంకటస్వామి, జిల్లా నాయకులు నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. చంద్ర రాజేశ్వరరావు తన జీవితాన్ని కమ్యూనిస్టు పార్టీకి అంకితం చేశారని అన్నారు. దోపిడీ రహిత, వర్గరహిత సమాజం కోసం జీవితకాలం పనిచేశారన్నారు.


చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

'ఆరోపణలు అవాస్తవం'

మంథని, ఏప్రిల్ 16: మంథని ప్రాంతంలోని ఇసుక క్వారీలు, లారీల రవాణాపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన ఆరోపణలు అవాస్తవమని డీసీసీ అధికార ప్రతినిధి ఇనుముల సతీష్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ సురేష్‌రెడ్డిలు ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇసుక మాఫియా నడిపిన చరిత్ర ఆయనదని, తమ ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు అవుతోందని, తమ ప్రభుత్వం వచ్చేసరికి అన్ని క్వారీలు బంద్ అయి రెండు క్వారీలు మాత్రమే నడుస్తున్నాయని, అవి కూడా ఓవర్ లోడ్ లేకుండా టీఎస్ఎండీసీ పరిధిలో నడుస్తున్నాయన్నారు. సంవత్సరం కింద రోడ్డు వేశారు.. కాంట్రాక్టర్ నాణ్యత లేని రోడ్లు వేశాడని, అందుకే డ్యామేజ్ అయిందని ఆరోపించారు. ఈ సమావేశంలో వైస్‌చైర్మన్ సీపతి బానయ్య, కౌన్సిలర్లు వీకే రవి, కుర్ర లింగయ్య, కాంగ్రెస్ నాయకులు గుండా పాపారావు, వేముల సమ్మయ్య, కొట్టే రమేష్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి

అంతర్గాం, ఏప్రిల్ 16: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా కృషి చేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం రామగుండం పట్టణంలోని 1వ డివిజన్ పరిధిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. కార్పొరేటర్ ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, నాయకులు శివరాత్రి గంగాధర్, మాడిశెట్టి రవీందర్, నారాయణదాసు మారుతి, మాజీ సర్పంచ్ ధర్మాజి కృష్ణ, అతహరోద్దీన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16: బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న లాబర్తి సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోదావరిఖనిలోని అడ్డగుంటపల్లిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులను కలుస్తూ ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. మే నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి గెలిపించాలని వారు కోరారు. బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ లాబర్తి కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, నాయకులు మామిడి సంపత్, అడ్డూరి రాజేష్, కుమ్మరి మల్లేష్, చల్ల వేణురెడ్డి, పంగ రవి, కానిపేట సంతోష్, వడ్డేపల్లి సదానందం, దుబ్బాసి లక్ష్మణ్ పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం'

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16: రామగుండం అభివృద్ధిని అడ్డుకోవడానికి కొంత మంది కోర్టుకు వెళ్లి ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బండారి రాయమల్లు, ప్రధాన కార్యదర్శి అనుమ రాయమల్లు ఆరోపించారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామగుండంను మోడల్‌సిటీగా చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రయత్నిస్తుంటే కొంతమంది అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వారు రెచ్చగొట్టే విధానాలను మానుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో గుండేటి రాజేష్, అనుమ సత్యనారాయణ, సిరిపురం మాణిక్యం, బూర్ల దామోదర్, ఆడెపు రవి, మౌనిక సతీష్, వేణు, బైరి శ్రీనివాస్, కనకరాజు పాల్గొన్నారు.

వినియోగదారులను గౌరవించాలి

- విద్యుత్ శాఖ సీఎండి వరుణ్‌రెడ్డి



సీఎండీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 16 : విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు వినియోగదారులను గౌరవిస్తూ సేవలు అందించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాఘవపూర్‌లోని విద్యుత్ శాఖ సమావేశ మందిరంలో వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమానికి ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ ఉద్యోగులు భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్ సరఫరా విషయంలో ఉద్యోగులు అందుబాటులో ఉండాలని, రైతులు, ప్రజలు ఇబ్బందులు లేకుండా సేవలందించాలన్నారు. అందిస్తున్న శిక్షణ ద్వారా ప్రతి ఒక్కరూ నైపుణ్యత, పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఉద్యోగులందరితో భద్రత విషయాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

- ముస్తాబైన ఆలయాలు..
- ఏర్పాట్లు పూర్తి



ఖనిలో ముస్తాబైన కోదండ రామాలయం



భక్తుల కోసం ఏర్పాటు చేసిన షామియానా

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 16: సీతారాముల కల్యాణానికి గోదావరిఖనిలోని కోదండ రామాలయం ముస్తాబయింది. బుధవారం జరిగే శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్వయంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఈనెల 13వ తేదిన సాయంత్రం నుంచి అధ్యయన ఉత్సవముల తో కల్యాణమహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో, కమిటీ ఆలయాన్ని ముస్తాబు చేశారు. మరో మినీ భద్రాచలంగా పిలవబడే ఈ కోదండ రామాలయంలో ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా భద్రాచలం ముహూర్తానికే 12.05 నిమిషాలకే ఇక్కడ కోదండ రామయ్యతో సీతమ్మ వారి మెడలో అర్చకులు తాళి కట్టిస్తారు. కల్యాణం వీక్షించేందుకు ఆరుబయట భక్తుల కోసం టెంట్లు వేశారు. వేసవి దృష్ట్యా ఎండతీవ్రతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సౌకర్యం కల్పించారు. సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు హాజరుకావాలని ఆలయ ఈవో, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, అర్చకులు కోరారు. అలాగే స్థానిక జీఎంకాలనీలోని సంజీవాంజనేయస్వామి ఆలయం, మార్కండేయ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లుచేశారు. కల్యాణోత్సవ వేడుకలు ఈనెల 23వ తేదితో ముగియనున్నాయని అర్చకులు తెలిపారు.

సుల్తానాబాద్ : శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆయా ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు కూర్చోనేందుకు, ఎండనుంచి ఉపశమనం పొందడానికి షామియానాలు ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్ పట్టణంలోని పెరిగిద్దె అంజనేయస్వామి ఆలయంలో స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ ఆకుల రామేశ్వర్‌పటేల్ అన్నారు. చిన్నకలువల, సుద్దాల, ఐతరాజుపల్లి, శాస్త్రినగర్, బొంతకుంటపల్లి, గర్రెపల్లి, సుగ్లాంపల్లి, కొదురుపాక తదితర గ్రామాల్లో బుధవారం కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.

ధర్మారం: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలను ముస్తాబు చేశారు. ధర్మారం, ఖిలావనపర్తి, కమ్మరీఖాన్‌పేట, గోపాల్‌రావుపేట గ్రామాల్లోని ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు, ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయాల ఎదుట ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జూలపల్లి : మండలంలోని ఆయాగ్రామాల్లో బుధవారం శ్రీరామానవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామాల్లో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జూలపల్లి మండల కేంద్రంతోపాటు వడుకాపూర్, కుమ్మరికుంట, తెలుకుంట, వెంకట్రావుపల్లి, కోనరావుపేట తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలు జరగనున్నాయి.

ఎలిగేడు : మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి గ్రామాల్లో ఉన్న నాగలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీరామ నవమిని పురస్కరించుకొని జరిగే శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి దేవాలయం ముస్తాబైంది. ఉదయం 6గంటలకు ప్రభాతసేవ, అభిషేకంలు, 7.05 ధ్వజారోహనం, 7.35కు దైవయజ్ఞం, 9 నుంచి రుద్రాభిషేకం, 11.45కు శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణమహోత్సవం, మధ్యాహ్నం 1.30నుంచి పూర్ణహతి, మంత్రపుష్పం, అనంతరం అన్నదానం జరుగనున్నాయి.

అభివృద్ధి పనులను పరిశీలన

అంతర్గాం, ఏప్రిల్ 16: రామగుండం 20వ డివిజన్ ఏరియా జీరో పాయింట్ ప్రాంతం నుంచి మల్యాలపల్లి వరకు ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ ద్వారా చేపడుతున్న తారు రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. రెండు కిలోమీటర్ల వరకు 3.75మీటర్ల వెడల్పుతో చేపట్టనున్న పనులను ఎన్‌టీపీసీ యాజమాన్యం 3 మీటర్ల వెడల్పుతో చేయడాన్ని కార్పొరేటర్ ఆక్షేపించారు. గతంలో ఉన్న రోడ్డు వెడల్పు 3.75 మీటర్లతో వేయాలని, లేకపోతే పనులను అడ్డుకుంటామన్నారు.

మే 15లోగా పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 16 : పాఠశాల అభివృద్ధి పనుల ప్రతిపాదనలను అమ్మ ఆదర్శ కమిటీలు త్వరగా రూపొందించి పనులను మే 15లోగా పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాల అభివృద్ధి పనులపై మండల సమాఖ్య సంఘాలు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 516 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామని, వీటిలో ఇప్పటివరకు 182 పాఠశాలల్లో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు మాత్రమే సిద్ధం చేశారని, చేపట్టాల్సిన పనులు గుర్తించి వాటి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పాఠశాల అభివృద్ధి పనుల గ్రౌండింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాలల అభివృద్ధి కోసం రూపొందించిన ప్రతిపాదనలో 25 శాతం నిధులు ముందస్తుగా అమ్మ ఆదర్శ పాఠశాలలకు మంజూరు చేయడం జరుగుతుందని, వీటిని వినియోగించుకొని పనులు గ్రౌండ్ చేయాలన్నారు. నిధులకు ఎటువంటి ఇబ్బంది లేదని పాఠశాల అభివృద్ధి పనులు అత్యంత ప్రాధాన్యతతో సకాలంలో పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన ఎలక్ట్రికల్ వస్తువులు, ఇతర చిన్న, చిన్న పనులు పూర్తి చేయాలని, వాటికి అవసరమైన నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి పాఠశాల వద్ద 25 వేల రూపాయల ఎమర్జెన్సీ ఫండ్ ఉంటుందని, వీటిని అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల తీర్మానించే వినియోగించుకోవచ్చని, ఎటువంటి ప్రతిపాదనలు, రికార్డులు అవసరం లేదన్నారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే బాలికల టాయిలెట్లు, బాలుర టాయిలెట్లు, తాగునీటి సరఫరా, తరగతి గదిలో ఉన్న మైనర్ రిపేర్లను పూర్తి చేయాలని తెలిపారు. జడ్పీ సీఈవో నరేందర్, డీఈవో మాధవి, డీఆర్‌డీవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన రంగనాథస్వామి ఆలయం

సుల్తానాబాద్, ఏప్రిల్ 16: మండలంలోని నీరుకుళ్ల మానేరు వాగులో వెలిసిన మానేటి రంగనాథ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 17 బుధవారం నుంచి 27వరకు భూనీళాసమేత రంగనాథ స్వామి తిరు కల్యాణోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం మధ్యాహ్నం కళ్యాణోత్సవం నిర్వహించనున్నారు. 18న మాతృక క్షేత్ర పాత్రక తదితర పూజలు, 19న గరుడ సేవ, వరుసగా ఈనెల 25 వరకు వివిధ సేవలు, ఉత్సవాలు జరుగుతాయి. 26 బ్రహ్మోత్సవాలలో చివరి ఘట్టం జాతర, రథోత్సవం ఉంటుంది.

● మాడ వీధుల నిర్మాణం

రంగనాథ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి వాహన సేవలు ఆలయం చుట్టు తిరిగేందుకు నూతనంగా మాడ వీధులను నిర్మించారు. ఏడు వాహనాలలో రోజుకొక సేవ చొప్పున నూతనంగా నిర్మించిన మాడ వీధుల్లో స్వామివారి శోభాయాత్ర కొనసాగుతుంది.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ గంగయ్య, అధికారులు



వడుకాపూర్‌లో ర్యాలీ..

సుల్తానాబాద్, ఏప్రిల్ 16: ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య పిలుపునిచ్చారు. సుల్తానాబాద్ పట్టణంలో మంగళవారం ఓటరు అవగాహన, చైతన్య కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఉద్యోగులు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర కళాశాలలో ర్యాలీని ఆర్డీవో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ ఓటర్లందరూ తప్పనిసరిగా ఓటును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాదవ్, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ శ్రావణ్‌కుమార్, ఏఎస్ఐ హన్మంతరావు, ఆర్ఐలు స్వాతి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి : మండలంలోని వడుకాపూర్‌లో మంగళవారం తహసీల్దార్ బషీరొద్దిన్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు,ఉపాధ్యాయులతో కలిసి ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి కిరణ్, ఆర్ఐ శ్రవంతి, పంచాయతికార్యదర్శి మౌనిక,ప్రధానోపాధ్యాయులు రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు మొగురం జమున, కన్నం వసంత, పుల్లూరి సరళ, మంద మానస, ఆశవర్కర్లు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలకుర్తి : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని ప్రతి ఒక్కరు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎన్నికల అవగాహన ప్రచార బృందం కళాకారులు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బసంత్‌నగర్ కేశోరాం ప్రధానద్వారం ముందు ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాకారులు దయా నర్సింగ్, సానగొండ రవిందర్, డిల్లీ, స్పందన, శ్వేత పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 16: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గ్యాస్ సిలిండర్ల ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ సిబ్బందితో పట్టణంలో అదిత్య టవర్స్‌లో కార్యక్రమం చేపట్టారు. వారోత్సవాల పోస్టర్లను గోడలకు అంటించారు. ఫైర్ సిబ్బంది మహేందర్‌రెడి, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, అజ్జు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్ : గోదావరిఖనిలోని వెంకటేశ్వర కాలనీలో అపార్ట్‌మెంట్ వద్ద అగ్ని ప్రమాదాల నివారణ, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఆర్.సత్యనారాయణ, సిబ్బంది సత్తయ్య, సురేష్‌బాబు, శ్రీకాంత్, శ్రీనివాస్, నాగేంద్ర, సంతోష్, తిరుపతి పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో హోమం



ఉత్సవ మూర్తులతో భక్తులు

ఓదెల, ఏప్రిల్ 16 : మండలంలోని గోపర పల్లి అభయాంజనేయ స్వామి క్షేత్రంలో మంగళవారం హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో నూతనంగా సీత,రామ లక్ష్మణ,ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిమలను శుద్ధిచేశారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. బుధవారం సీతారాముల కళ్యాణం కోసం ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గోపు నారాయణరెడ్డి, లావణ్య, జంగ నారాయణరెడ్డి, పోలాపెల్లి బుచ్చిరెడ్డి దంపతులు, రాజిరెడ్డి, బోయిని కుమార్ పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సాలో శ్రీరామనవమి వేడుకలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 16 : మండలంలోని పెద్దబొంకూర్ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, విభాగ అధిపతి బూర్ల శ్రీనివాస్,రమేష్, వంశీ, కళాశాల డైరెక్టర్ అడవల్లి నవత తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సంకీర్తన సప్తాహం

రామగిరి, ఏప్రిల్ 16: మండలంలోని కల్వచర్ల గ్రామంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని వారం రోజుల పాటు సంకీర్తన సప్తాహం నిర్వహిస్తున్నట్లు మంగళవారం శివరామకృష్ణ భజన మండలి ఒక ప్రకటనలో పేర్కొంది.

ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 16: గోదావరిఖని సంజయ్‌గాంధీనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో ఐఎన్‌టీఎస్ఓ ఒలింపియాడ్ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు, బంగారు పతకాలు, సర్టిఫికెట్లను పాఠశాల ప్రిన్సిపాల్ ఫిబా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ శ్యామ్, ఇన్‌చార్జి ఆంజనేయులు, సీ బ్యాచ్ ఇన్‌చార్జి తిరుపతి, ప్రైమరీ ఇన్‌చార్జి స్రవంతి పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

సుల్తానాబాద్, ఏప్రిల్ 16: సుల్తానాబాద్‌కు చెందిన మంకీ ఫస్ట్ కుంగ్‌ఫూ అకాడమీకి చెందిన పలువురు విద్యార్థులు కరాటే పోటీలలో ప్రతిభను చాటుకున్నారు. వీరికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేశారు. కోచ్ సతీష్, మాజీ జడ్పీటీసీ ఐల రమేష్, మాజీ ఎంపీటీసీ పల్లా సురేష్, నందిని శ్రీనివాస్, స్పోర్ట్స్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి అమరిశెట్టి తిరుపతి, మంద శ్రీనివాస్ గౌడ్, సిరిపురం రమేష్, ఆవుల శివ పాల్గొన్నారు. స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు కూడా కరాటే పోటీలలో పతకాలు సాధించారు. వీరిని స్కూల్ యజమాన్యం అభినందించింది.

యువతి వివాహానికి చేయూత

కమాన్‌పూర్, ఏప్రిల్ 16: మండల కేంద్రానికి చెందిన సానియా పెళ్లికి మంగళవారం వంట పాత్రలను సీనియర్ జర్నలిస్టు ఆధ్వర్యంలో సానియా తల్లికి అందజేశారు. ఈనెల 21న పెళ్లి ఉండగా ఉమ్మడి కరీంనగర్ మైనార్టీ పోలీస్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం యువతుల పెళ్లిలకు సహాయం చేస్తున్నారు. రిటైర్డు సీఐ షేర్ అలీని సంప్రదించగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో వదువుకు వంట పాత్రలు పంపించారు. సీనియర్ జర్నలిస్ట్ జబ్బార్‌ఖాన్, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు సతీష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రఫీ, షౌకత్ ఖాన్ బాబా, అస్టర్‌లు అందజేశారు.

'బీఆర్ఎస్ హయాంలో రోడ్లు అధ్వాన్నం'

ముత్తారం, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక క్వారీలు ప్రారంభించిన నెలల పరిధిలోనే రోడ్డు అధ్వానంగా తయారయ్యాయని, ఇప్పుడు రోడ్ల గురించి జడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడడం విడ్డూరంగా ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. మంగళవారం ముత్తారం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ స్వార్థం కోసం ప్రభుత్వాన్ని విమర్శిస్తే చూస్తూ ఊరుకుండబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దెల రాజయ్య, రాపల్లి రామన్న, గాదం శ్రీనివాస్, లక్కం ప్రభాకర్, ఆకోజు అశోక్ చారి, బొడ రత్నాకర్ గౌడ్ పాల్గొన్నారు.

'దుద్దిళ్ల సోదరులపై ఆరోపణలు చేస్తే ఊరుకోం'

కమాన్‌పూర్, ఏప్రిల్ 16: నియోజకవర్గ అభివృద్ధికి శ్రమిస్తున్న దుద్దిళ్ల సోదరులపై పుట్ట మధు తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని కమాన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వైనాల రాజు హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఇసుక రీచ్‌ల ద్వారా ఉచితంగా ప్రజలకు ఇసుక సరఫరాను ప్రారంభిస్తే అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారని పుట్ట మధు చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు గాండ్ల మోహన్, రంగు సత్యనారాయణ, ఆడెపు రమేష్, మండల అధికార ప్రతినిధి చొప్పరి శేఖర్, జిల్లా కార్యదర్శి బొంపల్లి రాజన్న తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 16 : మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీనర్సయ్య మాట్లాడారు. కళాశాలలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు నితిన్, రేల్ల సంజీవ్, రవిందర్‌రావు, రామకృష్ణ, అర్జున్, తిరుపతి, అంజయ్య, సునిత, కిరణ్మయి, రజిత, భాను, విజయానంద్, తిరుపతి, రమేష్, సతీష్, వంశీ పాల్గొన్నారు.

నేత్రదానం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 16: కాలనీలో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న వీరయ్య మంగళవారం మరణించగా ఆయన నేత్రాలను కుటుంబీకులు సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు. వీరయ్య గుండెపోటుతో తెల్లవారు జామున కన్నుమూశాడు. గోదావరిఖని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మేరుగు శ్రీకాంత్ నేత్రదాన ఆవశ్యకతను వీరయ్య కుటుంబసభ్యులకు వివరించడంతో నేత్రదానానికి ఆయన కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ వీరయ్య నేత్రాలను సేకరించి ఐ బ్యాంక్‌కు తరలించారు. మరొకరి జీవితంలో వెలుగు నింపేలా నేత్రదానానికి అంగీకరించిన వీరయ్య లలిత, కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, గౌరవ అధ్యక్షుడు సానా రామకృష్ణరెడ్డి అభినందించారు.



త్యాగాల పునాదుల మీద ఏఐటీయూసీ నిర్మాణం

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యూసుఫ్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 16: త్యాగాల పునాదుల మీద సిద్ధాంతం ఆధారంగా నడుస్తున్న కార్మిక సంఘం ఏఐటీయూసీ అని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ అన్నారు. ఆర్జీ-2 బ్రాంచి కమిటీ, ఇతర కమిటీ సభ్యులకు ట్రేడ్ యూనియన్ శిక్షణా తరగతులు మంగళవారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈసందర్భంగా యూసుఫ్ మాట్లాడారు. రాజకీయ పార్టీల మద్దతు, అధికారంలో ఉన్న పార్టీ అండతో నడిచిన కార్మిక సంఘాలు ఉనికి కోల్పోయాయన్నారు. ఏపార్టీ గెలిచినా, అధికారంలో ఎవరు ఉన్నా కార్మికుల పక్షాన నిలవడమనే ఏఐటీయూసీ పని విధానమన్నారు. గత సంఘం పనితీరు నచ్చకనే కార్మికులు ఏఐటీయూసీని గెలిపించారని, గుర్తింపు హోదా వచ్చిందని పనితీరులో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. పిట్ స్థాయిలో కార్మికులకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. కార్మిక చట్టాలు, డీజీఎంఎస్ నిబంధనలు, కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణా తరగతుల్లో వివిధ అంశాలపై యూనియన్ ముఖ్య నాయకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు, సెంట్రల్, ఆర్జీ-2 బ్రాంచి నాయకులు ప్రకాష్, రాజారత్నం, బుర్ర తిరుపతి, జిగురు రవీందర్, అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, గౌతం గోవర్ధన్ పాల్గొన్నారు.

గని కార్మికుల పని వేళలు మార్చాలి : టీబీజీకేఎస్



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, ఏప్రిల్ 16: రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా సింగరేణి ఓపెన్‌కాస్టు గనుల్లో పనివేళలు మార్చాలని టీబీజీకేఎస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ తీర్మానం చేసింది. మంగళవారం గోదావరిఖని చౌరస్తాలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన స్టీరింగ్ కమిటీ సమావేశంలో చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. 44డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుతున్నాయని, క్వారీల్లో పని చేసే కార్మికులకు సౌకర్యం కలిగే విధంగా మధ్యాహ్న సమయాల్లో ప్రాజెక్టులపై ఏసీ రెస్ట్ షెల్టర్లను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎండ నుంచి ఉపశమనం కలిగే విధంగా ఇప్పుడిస్తున్న మజ్జిగ ప్యాకెట్‌తో మరొక ప్యాకెట్ పెంచి ఇవ్వాలన్నారు. అంతేకాకుండా సింగరేణి కార్మికుల వ్యక్తిగత వివరాలకు కంప్యూటరీకరణ చేసిన అనంతరం కూడా మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రికి పంపించే వారిని రెఫరల్ పేరుతో గుర్తింపు పత్రాలు కావాలని తిప్పుకోవడం మానుకోవాలన్నారు. కార్మికులు కోరిన కార్పొరేట్ ఆసుపత్రికి చికిత్స కోసం పంపించాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు సిఫార్సు చేసిన మందులను మాత్రమే రోగులకు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, మాదాసు రామమూర్తి, వడ్డేపల్లి శంకర్, శేషగిరి, పొలాడి శ్రీనివాసరావు, అంజయ్య, సురేందర్, మల్లేష్, తిరుపతి, రాజ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, డీ శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, సురేందర్, అభిషేక్, మహిపతి, అశోక్, భాస్కర్, రాజు పాల్గొన్నారు. పునర్‌నిర్మాణ దశలో ఉన్నందున రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం ఈనెల 24న గోదావరిఖనిలో ఏర్పాటు చేసినట్టు రాజిరెడ్డి తెలిపారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగే ఈ సమావేశానికి సింగరేణి 11డివిజన్ల నుంచి 500మంది ప్రతినిధులు, నాయకులు హాజరవుతారన్నారు. సింగరేణి కార్మిక హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిన టీబీజీకేఎస్‌కు సింగరేణి వ్యాప్తంగా మంచి స్పందన వస్తుందన్నారు. 24న గోదావరిఖనిలో జరిగే జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాజిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా మహాసభల పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు.

'రోడ్ల వెడల్పు సరికాదు'

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16: రామగుండం నియోజకవర్గంలో కేవలం 1.5లక్షల మందే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఓట్లు వేసేందుకు కూడా జనం ముందుకు రావడం లేదని, అలాంటప్పుడు రోడ్ల వెడల్పు, అభివృద్ధి ఎందుకని హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట వేణు ప్రశ్నించారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరిఖనిలో అభివృద్ధి పేర రోడ్డు వెడల్పు చేయడం, షాపింగ్ మాల్ కట్టాలనుకోవడం సరికాదన్నారు. 15రోజుల్లో క్వార్టర్లు ఖాళీ చేయాలని సింగరేణి ఇచ్చిన నోటీసును హైకోర్టు తప్పుబట్టిందని, 72కార్మిక కుటుంబాలకు రెండు నెలలు గడువు ఇచ్చిందని పేర్కొన్నారు. సింగరేణి జీఎం, పోలీసులు చట్ట పరిధిలో పని చేయాలని హెచ్చరించారు.

'కేంద్ర ప్రభుత్వానివి కార్మిక వ్యతిరేక విధానాలు'

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16: కేంద్ర ప్రభుత్వానికి కార్మిక వ్యతిరేక విధానాలని, వాటికి వ్యతిరేకంగా మేడే జరుపుదామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ కృష్ణ, సహాయ కార్యదర్శి ఏ వెంకన్న పిలుపునిచ్చారు. మంగవారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో ఐ కృష్ణ, ఏ వెంకన్నలు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో పెట్టుబడిదారీ వర్గంతో పాటు ఆధునిక పారిశ్రామిక కార్మికవర్గం ఏర్పడిందన్నారు. యాజమాన్యాల శ్రమదోపిడి పెరిగిందని, కార్మికులను బానిసలుగా పని చేయిస్తున్నారన్నారు. 1886లోఅమెరికాలోని చికాగో నగరంలో కార్మికవర్గం యాజమాన్యాలపై సమ్మె పోరాటానికి సైరన్ మోగించిందని, యాజమాన్యాల మెడలు వంచి 8 గంటల పని దినం సాధించిందని, కార్మిక వర్గ హక్కుల కోసం పోరాడిందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎన్నో పోరాటాలు చేసే సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులను బానిసలుగా మార్చే కుట్రకు పూనుకుందన్నారు. బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బీ అశోక్, చిలుక శంకర్, కోంద్ర మొగిలి, ఎం దుర్గయ్య, డీ బుచ్చమ్మ, తిప్పని రామ్‌కి, బీ కొమురయ్య, కే ఎల్లయ్య, కాదాసి లింగమూర్తి పాల్గొన్నారు.